
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
3



మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 12 జూన్ 2024



బడిగంటకు వేళాయె..



- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,187 ప్రభుత్వ స్కూల్స్
- అరకొర వసతుల మధ్య విద్యార్థులకు స్వాగతం
- పూర్తికాని మన ఊరు మన బడి పథకం పనులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 11: వేసవి సెలవులు ముగిశాయి. పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ఇప్పటి వరకు ఆట పాటల్లో మునిగి తేలిన విద్యార్థులు బుధవారం నుంచి బడిబాట పట్టనున్నారు. దాంతో ఇంతకాలం మూగబోయిన స్కూల్స్ విద్యార్థులతో సందడిగా మారనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,187 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, మొదటి రోజే విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫామ్స్ అందజేసేందుకు చాలా స్కూల్స్‌లో ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఒకటి నుంచి పదోతరగతి వరకు పాఠ్య పుస్తకాలను కూడా అందించనున్నారు.

అరకొర వసతులు

గత ప్రభుత్వం మన ఊరు, మన బడి పథకం కింద పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది, పేద.. బడుగు.. బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. పథకం కింద చేపట్టిన నూతన తరగతి గదుల నిర్మాణాలు ఇప్పటి వరకు కనీసం 30 శాతం కూడా పూర్తవలేదు. దాంతో ఇరుకు గదుల్లో, ఆరు బయటే విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల వంట గదులు సరిగా లేవు. వంట గదులు లేని చోట ఆరు బయటే వంటలు చేయాల్సి వస్తోంది.



గండీడ్ మండలం సల్కార్‌పేట ఉన్నత పాఠశాలలో పూర్తి కాని మరుగుదొడ్ల నిర్మాణం

ఉపాధ్యాయుల కొరత

ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 16 వేల ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉన్నా.. 12,706 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఆ ఉపాధ్యాయులు సెలవు పెడితే పాఠశాలలు మూత పడుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఉన్నత పాఠశాలల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. పలు చోట్ల పట్టణ కేంద్రాలు, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండగా.. ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. లోకల్ బాడీ పాఠశాలల్లో మాత్రం అందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు వలంటీర్లను నియమించకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. ఈ ప్రభుత్వమైనా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు భర్తీ చేసి, నాణ్యమైన విద్య అందేలా చూడాలని సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని, ఎన్నడూ లేని విధంగా మొదటి రోజే యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందించనున్నామని మహబూబ్‌నగర్ డీఈవో ఎ.రవీందర్ తెలిపారు.

ఫిట్‌నెస్ 40 శాతమే..



ఫిట్‌నెస్ పరీక్షల కోసం మహబూబ్‌నగర్ ఎంవీఐ కార్యాలయానికి వచ్చిన స్కూల్ బస్సులు



బస్సును పరిశీలిస్తున్న ఎంవీఐ వాసు

- ఉమ్మడి జిల్లాలో 992 ప్రైవేట్ బస్సులు..
- అందులో 410 బస్సులకే సామర్థ్య పరీక్షలు
- యాజమాన్యాల నిర్లక్ష్యం.. రవాణా శాఖ ఉదాసీనత
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం.. రోడ్డెక్కనున్న బస్సులు
- ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తామంటున్న రవాణా శాఖ

మహబూబ్‌నగర్, జూన్ 11: రెండు నెలల సెలవుల అనంతరం బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇంటినుంచి స్కూల్‌కు తీసుకువెళ్లే బస్సుల కండీషన్‌పై మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. సెలవుల్లోనే బస్సులకు ఫిట్‌నెస్(సామర్థ్య) పరీక్షలు చేయించుకోవాల్సి ఉండగా, పాఠశాలలు ఓపెన్ అవుతున్నా.. ఇంకా మూడోవంతు బస్సులు పరీక్షలు చేయించుకోకపోవడం యాజమాన్యాల నిర్లక్ష్యం, రవాణాశాఖ ఉదాసీన వైఖరిని ఎత్తిచూపుతోంది.

ఉదాసీన వైఖరి

స్కూల్ బస్సులకు ఏటా రవాణా శాఖ ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ పరీక్షలో బస్సు టైర్లు, కండిషన్, విద్యార్థుల కోసం తీసుకుంటున్న భద్రతా చర్యలను పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే సర్టిఫికెట్ జారీ చేస్తారు. అప్పుడే బస్సులు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల్లో 992 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 410 బస్సులకు అంటే 40 శాతం మాత్రమే సామర్థ్య పరీక్షలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 280, వనపర్తిలో 61, నారాయణపేటలో 32, గద్వాలలో 37 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. ఇంకా 582 బస్సులకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. బుధవారం నుంచి ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేసి, ఫిట్‌నెస్ చేయించుకోని బస్సులను సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతోంది. దీనిని బట్టి చూస్తే వందశాతం పరీక్షలు నిర్వహించడం ఉట్టిమాటే అన్న విషయం స్పష్టమవుతోంది. అధికారులు స్కూళ్లు ప్రారంభమైన వారం రోజుల పాటు తనిఖీలు నిర్వహించి, ఆ తరువాత వదిలేయడం పరిపాటిగా జరుగుతోంది. కాగా మంగళవారం ఫిట్‌నెస్ పరీక్షలకు అధిక సంఖ్యలో బస్సులను ఆయా జిల్లాల రవాణా శాఖ కార్యాలయాలకు తెచ్చారు.

డ్రైవర్ల ఎంపిక కీలకం

ప్రైవేట్ స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒక బస్సు డ్రైవర్‌పై 50-60 మంది విద్యార్థుల జీవితాలు ఆధారపడి ఉంటాయి. తల్లిదండ్రులు కూడా పాఠశాల పేరు, విద్యపైనే దృష్టి సారిస్తారు. కానీ బస్సు డ్రైవర్ గురించి పెద్దగా ఆలోచించరు. యాజమాన్యం నియమించిన బస్సు డ్రైవర్ల పరిస్థితిని రవాణాశాఖ అధికారులు నిర్ణయించాలి. బస్సు ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో.. డ్రైవర్ల అర్హతలు కూడా అంతే ముఖ్యం. గతేడాది మహబూబ్‌నగర్ సమీపంలోని బొక్కలోనిపల్లి దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద వర్షం నీరు చేరింది. డ్రైవర్ ఈ నీటిని సరిగా అంచనా వేయలేక నీటిగుండా వెళ్లడంతో మధ్యకు వెళ్లగానే నీరు బస్సులోకి చేరి, ఇంజన్ ఆగిపోయింది. దాంతో విద్యార్థులు హాహాకారాలు చేశారు. స్థానికులు వెంటనే స్పందించి విద్యార్థులను బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. అందుకే అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాల్సి ఉంటుంది.

ఆటో ప్రయాణం జాగ్రత్త

స్కూల్ బస్సులతోపాటు ఆటోలలో విద్యార్థులను తరలిస్తుంటారు. స్కూల్ బస్సులకన్నా ఆటోలనే ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఆటో డ్రైవర్‌లు పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కించుకుంటారు. స్కూల్ బ్యాగ్‌లను సైడ్‌కు వేలాడదీసి, వెనుక వస్తున్న వాహనాలు కూడా కనిపించకుండా ఓవర్ లోడ్‌తో వెళ్తుంటారు. వీటి వల్ల పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రవాణా శాఖ అధికారులు ఆటోలపైనా దృష్టి సారించి, ఓవర్ లోడ్‌తో వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



మహబూబ్‌నగర్‌లో బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తున్న ఎంవీఐ, సిబ్బంది

రేపటి నుంచి తనిఖీలకు ప్రత్యేక బృందాలు

స్కూల్ బస్సులకు ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. ఇప్పటివరకు మహబూబ్‌నగర్‌లో 50 శాతం వరకు బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేశాం. మిగతా బస్సుల యాజమాన్యాలు వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున రేపటి నుంచి తనిఖీలకు ప్రత్యేక బృందాలను నియమించాం. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వచ్చే బస్సులపై చర్యలు తీసుకుంటాం.

- వాసు, ఎంవీఐ, మహబూబ్‌నగర్

రూ.11 లక్షలు ఇవ్వక అందని నీరు



అక్విడెక్ట్ పనులలో వంతెన నిర్మాణానికి అడ్డుగా వచ్చిన విద్యుత్ లైన్(ఇన్‌సెట్లో విద్యుత్ స్తంభం)

- నెట్టెంపాడు ప్రాజెక్టులో నిలిచిన 99, 100వ ప్యాకేజీల పనులు
- అక్విడెక్ట్ పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్
- దాన్ని మార్చేందుకు రెండేళ్లుగా నిధులివ్వని గత ప్రభుత్వం
- ఫలితంగా 63 వేల ఎకరాలకు అందని నీరు
- డిప్యూటీ సీఎం హామీతోనైనా నిధులు విడుదలయ్యేనా!

గద్వాల, జూన్ 11: జోగుళాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో 99, 100వ ప్యాకేజీ కాలువ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. అక్విడెక్ పనుల నిర్మాణానికి విద్యుత్ లైన్ అడ్డుగా మారింది. లైన్ మార్చడానికి రూ.11 లక్షలు ఖర్చు అవుతుందని విద్యుత్ అధికారులు నివేదించారు. నిధులు విడుదల కాకపోడంతో పనులు నిలిచిపోయాయి. దీని కారణంగా 63 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రాకుండా పోయింది. 2014 ఎన్నికల నుంచి ప్రతీ ఎన్నికల్లో ఈ 99, 100వ ప్యాకేజీ పనులు పూర్తి చేస్తామని, సాగు నీరు అందిస్తామని ప్రధాన పార్టీలు, నాయకులు చెబుతూనే వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్వాలలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల సభలో అమిత్ షా 99వ ప్యాకేజీ గురించి ప్రస్తావించి, పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అదేవిధంగా శాంతినగర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రస్తావించి, పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తానే ఆర్థిక శాఖ మంత్రిని కాబట్టి ఎన్నికల కోడ్ ముగియగానే నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.

అక్విడెక్ట్ పనులే సమస్య

99వ ప్యాకేజీ కాలువ పనులు గద్వాల మండలం కొండపల్లి దగ్గర జరుగుతున్నాయి. అక్కడ అక్విడెక్ట్ పనులు ప్రధానమైనవి. వీటి నిర్మాణానికి రూ.ఐదు కోట్ల నిధులు విడుదల అయ్యాయి. ఈ పనులకు విద్యుత్ లైన్ అడ్డుగా రావడంతో లైన్‌ను మార్చడానికి రూ.11 లక్షలు అవసరమవుతాయని విద్యుత్ అధికారులు అంచనా వేశారు. ఆ నిధులు విద్యుత్ శాఖకు జమ చేస్తేతప్ప పనులు చేయలేమని వారు తేల్చిచెప్పారు. ఇందుకోసం ఇరిగేషన్ శాఖ 2022 మే నెలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కానీ నేటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో అక్విడెక్ట్ పనులు నిలిచిపోయాయి. ఇవి పూర్తయితేనే 63 వేల ఎకరాల వరకు సాగు నీరు అందుతుంది. అదేవిధంగా నక్ష బాటలకు నాలుగు బ్రిడ్జిల నిర్మాణం జరగాల్సి ఉంది. వీటికి కూడా ప్రతిపాదనలు పంపినా, నిధులు విడుదల కాలేదు. ఏటా వానాకాలం సీజన్ నాటికి పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. కానీ పూర్తి చేయడం లేదు. వచ్చే వానాకాలం నాటికైనా పూర్తవుతుందా? నీళ్లు ఎప్పుడిస్తారు? అని రైతులు ఎదురు చూస్తున్నారు.

99వ ప్యాకేజీ పనులు పెండింగ్



నిర్మాణంలో ఉన్న పనులు

నెట్టెంపాడు ప్రాజెక్టు లిఫ్ట్-1 కింద ధరూర్ మండలంలో గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిర్మించారు. దీని సామర్థ్యం 1.19 టీఎంసీలు కాగా, ఆయకట్టుకు సాగు నీరు అందించడానికి కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. ఎడమ కాలువ కింద ఆరువేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కానీ.. కుడి కాలువ పరిస్థితే నత్తకు నడకనేర్పేలా తయారైంది. ఈ కుడి కాలువ పనులను 99, 100వ ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్యాకేజీల పరిధిలో ధరూర్, గద్వాల, ఇటిక్యాల మండలాల్లో 76 కిలో మీటర్ల పొడవున కాలువ నిర్మాణం జరగాలి. ఇటిక్యాల మండల పరిధిలో 100వ ప్యాకేజీ పనులు ఒక కిలోమీటరు తప్ప దాదాపు 40 కిలో మీటర్ల పొడవున పూర్తయ్యాయి. 99వ ప్యాకేజీ పనులు ధరూర్, గద్వాల మండలాల పరిధిలో 36 కిలో మీటర్ల మేర జరగాల్సి ఉంది. కొండపల్లి దగ్గర పనులు కొనసాగుతున్నాయి.

రూ.లక్షా 56 వేలు స్వాహా



- సైబర్ క్రైంలో పోగొట్టుకున్న ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 11: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ రూ.లక్షా 56 వేలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేటలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి నాగర్‌కర్నూల్‌లో ఉంటున్నాడు. అతని ఫోన్‌కు వారం రోజుల కింద ఒక లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయడంతో సైబర్ నేరగాళ్లు అతని న్యూడ్ ఫొటోలు తీశారు. తర్వాత బ్యాంక్ మేనేజర్‌ను బ్లాక్‌మెయిల్ చేసి, రూ.లక్షా 56 వేలు తీసుకున్నారు. అయినా వదలని నేరగాళ్లు అతని వాట్సాప్ డీపీగా న్యూడ్ ఫొటో పెట్టి మళ్లీ బ్లాక్ మెయిల్ చేయడం మొదలెట్టారు. ఇంకా ఎక్కువ డబ్బులు ఇవ్వకపోతే నీ ఫోన్‌లో ఉన్న అందరి నంబర్లకు న్యూడ్ ఫొటోలు పంపిస్తామని బెదిరించారు. దాంతో బ్యాంక్ మేనేజర్ మంగళవారం నాగర్‌కర్నూల్ సైబర్ పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.


విద్యుత్ తీగలు తగిలి బాలుడి మృతి

మానవపాడు, జూన్ 11 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన జగ్గల శ్రీనివాసులు, మద్దమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు వీరేష్ (7) ఉన్నారు. మంగళవారం కొత్త ఎస్సీ కాలనీలోని తమ ఇంటి సమీపంలో రోడ్డుపై ఉన్నాడు. అదే సమయంలో రెండు ఎద్దులు పోట్లాడుకుంటూ విద్యుత్ స్తంభానికి తగిలాయి. దీంతో ఎల్టీ విద్యుత్ తీగ కిందకు పడిపోయింది. అక్కడే ఉన్న వీరేష్‌కు తగిలి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో బాధిత తల్లిదండ్రులు, కాలనీవాసులు కన్నీరుమున్నీరై విలపించారు.



ఆలయాలు సమష్టి జీవనానికి తార్కాణాలు

- వట్టెం, బిజినేపల్లిలలోని వెంకన్న ఆలయాల్లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి పూజలు



వట్టెం వెంకన్న ఆలయంలో మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనా రెడ్డి

బిజినేపల్లి, జూన్ 11 : వేల సంవత్సరాల నుంచి ఆలయాలు మానవుల సమష్టి జీవన విధానాన్ని ప్రబోధించే తార్కాణాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా వట్టెం, బిజినేపల్లి గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలను ఆయన మంగళవారం సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆలయాల్లో భజనలు, కీర్తనలు, కచేరీలు, పురాణగాథల ప్రసంగాల ద్వారా వివిధ వర్గాల ప్రజలను ఒకే వేదికపై చేర్చి ఒకరికొకరు సాయం చేసుకోవడంతో పాటు మానవత్వం, ప్రేమ, దానగుణం, మంచి నడవడికకు మార్గం చూపుతున్నాయని అన్నారు. ఎంతో మంది నాస్తికులు నాస్తికత్వం గురించి పుస్తకాలు, ప్రసంగాలు చేసినా వారి చివరి క్షణాల్లో దైవ చింతన చేసి పశ్చాత్తాప పడ్డారని చెప్పారు. పురాతనమైన ఆచారాలు, వ్యవస్థలను కాపాడుకుంటేనే మనుగడ ప్రశాంతంగా సాగుతుందన్నారు. ఆలయాలను నిర్మించడం తేలికైనా, భక్తులు, భగవంతుడికి అనుసంధానంగా ఆలయ పరిసరాలు, నిత్య ధూప దీప నైవేద్యాలు, నిర్వహణ వంటి వాటిని భక్తిశ్రద్ధలతో కొనసాగించడం గొప్ప విషయమని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను కొనియాడారు. వట్టెం ఆలయంలో నిత్య అన్నదానం చేపడుతున్న వాస ఈశ్వరయ్యను అభినందించారు. అంతకు ముందు గవర్నర్‌కు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి పూర్ణకుంభంతో వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి, ఆశీర్వాదం అందించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గవర్నర్ మొక్కను నాటారు. బిజినేపల్లిలోని ఆనందగిరి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, వట్టెం వెంకన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సందడి ప్రతాప్ రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బంగారు శ్రుతి, ఇన్‌కం ట్యాక్స్ రిటైర్డ్ అఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

పీజీ సెంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కొల్లాపూర్, జూన్ 11 : పాలమూరు యూనివర్సిటీ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియత్ మంగళవారం వెల్లడించారు. కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, ఎంకామ్, ఎమ్మెస్సీ మ్యాథమేటిక్స్, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో ప్రవేశాలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 17 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియత్ వెల్లడించారు. టీఎస్‌టీటీజీఈసీ 2024 ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ పూర్తయిన ప్రతీ విద్యార్థితో పాటు డిగ్రీ తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

▸▸ యువకుడికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి, జూన్ 11 : అదుపు తప్పి ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఆంజనేయులుగౌడ్(24) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామంలోని కొత్త బస్టాండ్ సమీపంలో నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు మహబూబ్‌నగర్ వైపు నుంచి గ్రామానికి వస్తుండగా ఢీకొట్టింది. గమనించిన గ్రామస్థులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని యువకుడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. యువకుడికి చికిత్స అందిస్తున్నట్లు వారు తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఒకరికి..

వంగూరు : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం కారు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

ఏఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వంగూరు మండలంలోని వెలమలపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్‌ను స్థానికులు కల్వకుర్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలోని యెన్నమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన జింక మృతి




ఊర కుక్కల దాడిలో గాయపడిన జింకకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్

తిమ్మాజిపేట, జూన్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని కోట పరిసర ప్రాంతంలో మంగళవారం తిరుగుతూ కన్పించిన జింక ఊరకుక్కల దాడిలో గాయపడింది. గమనించిన గ్రామస్థులు వెంటనే పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్‌కు సమాచారమిచ్చారు. దీంతో పశువైద్యాధికారి అక్కడికి వెళ్లి జింకను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు మరణించిన జింకను తీసుకెళ్లారు. కాగా, జింక తమ గ్రామ పరిసరాల్లో తిరిగిందన్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ ప్రజలు, పలువురు నాయకులు తరలి రావడం విశేషం.

ఉపాధి హామీ కూలీ మృతి


కావలి చెన్నయ్య(ఫైల్)

మదనాపురం, జూన్ 11: ఉపాధి హామీ కూలి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనాపురం మండలంలోని నర్సింగాపురంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. నర్సింగాపురం గ్రామానికి చెందిన కావలి చెన్నయ్య (58) రోజు మాదిరిగానే మంగళవారం ఉపాధిహామీ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ఛాతిలో నొప్పిరావడంతో అక్కడే కుప్ప కులాడు. గమనించిన తోటి కూలీలు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి యాదగిరి కోరారు.







పారదర్శక పాలన అందిద్దాం

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 11: ప్రజలు మెచ్చే విధంగా పారదర్శకమైన ప్రజాపాలన అందించేందుకు అధికారులు సహకారం అందించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం వనపర్తి కలెక్టరేట్‌లో వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు మెచ్చే పాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, అందుకు ఆయా శాఖల అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ముందుగా వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే శుద్ధిచేసిన తాగునీరు, పరిశుభ్రత, వైద్య సదుపాయం అందుబాటులో ఉండాలని తెలిపారు. శుద్ధిచేసిన తాగునీటిని అన్ని కుటుంబాలకు సమానంగా అందించే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చిన నిధులను ఆయా గ్రామ పంచాయతీలకు పంపించి పారిశుధ్య పనులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు అంబులెన్స్ సౌక ర్యం కల్పించేందుకు అవసరమైన నిధులను అందిస్తామ ని తెలిపారు. రేమద్దుల గ్రామంలో నిర్మించిన ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో మొత్తం విద్యార్థులు ఎంత మంది, ఉపాధ్యాయులు ఎంతమంది, ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని ఖాళీలు ఉన్నాయని విద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. పెద్దదగ డ, పెద్దమారూర్‌లోని నాలుగు పాఠశాలలకు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మంజూరు అయిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లను యుద్ధ ప్రాతిపది కన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరును ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టే పని చేయవద్దని, ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించా రు. ఎంత మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖా స్తు చేసుకున్నారు. వాటి పురోగతి ఏంటి అని విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ నిర్వహణ లోపం వల్ల శుభ్రమైన నీరు రావడం లేదని ఇది ఎంతమాత్రం ఉపేక్షించేది కాదని, రేపటి నుంచి జిల్లాలో శుభ్రమైన నీరు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించా రు. అదేవిధంగా విత్తనాలు, ఎరువుల నిల్వల వివరా లు అడిగి తెలుసుకున్నారు. బీమా, కల్వకుర్తి పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి భూ సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలు ఫిర్యాదుల పై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండాలి : మంత్రి జూపల్లి

చిన్నంబావి : మండలంలోని పెద్దమారురు గ్రామంలో చేపడుతున్న పాఠశాల అభివృద్ధి పనులను మంత్రి జూపల్లి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, తాగునీటి వసతి, వంటగది, మరుగుదొడ్లను నాణ్యతగా నిర్మించాలని సూచించారు.

అచ్చంపేటలో బీఆర్ఎస్‌కు బీటలు

- నేడు మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం



అచ్చంపేట మునిసిపాలిటీ కార్యాలయం

అచ్చంపేట, జూన్ 11: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒక్కొక్కరుగా అధికార పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. అదే కోవలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్ ఎడ్ల నర్సింహ్మగౌడ్‌పై నేడు అవిశ్వాసానికి రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూరు, వంగూరు, చారకొండ మండలాల ఎంపీపీలతో పాటు లింగాల, అచ్చంపేట, ఉప్పునుంతల జడ్పీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. మిగిలిన అచ్చంపేట మునిసిపల్ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకుంటే అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లినట్లే. మునిసిపల్ ఛైర్మన్ పదవిని ఎలాగైనా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రెండు నెలలుగా కౌన్సిలర్లతో మంతనాలు చేపట్టింది. అందులో భాగంగా గతనెల కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. ఈ క్రమంలో అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 15మంది సభ్యుల మద్దతు ఉండాలి. 2021 ఏప్రిల్ 30న జరిగిన ఎన్నికల్లో 20వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ ఆరు, బీఆర్ఎస్ 13, బీజేపీ నుంచి ఒకరు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే ఆకుల లావణ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్ శైలజ కాంగ్రెస్ గూటికి చేరారు. ఇటీవల రెండో వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి చేరింది. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఛైర్మన్ మార్పు కోసం తమ మద్దతు ఉంటుందని పరోక్షంగా సంకేతాలు ఇవ్వడంతో వారితో మాట్లాడి హైదరాబాద్‌కు తరలించారు. మరో ఐదు మంది కౌన్సిలర్లు క్యాంపులో ఉండడంతో కాంగ్రెస్‌కు ఛైర్మన్ పీఠం దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కందనూలులో అవిశ్వాసం పెట్టాల్సిందే

- మునిసిపల్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్ల డిమాండ్

నాగర్‌కర్నూల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మునిసిపల్ ఛైర్మన్లు, ఎంపీపీలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ తాజాగా నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీపై కూడా దృష్టి సారించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలు ఆ పార్టీ ఆధీనంలో ఉన్నాయి. ప్రభుత్వ మార్పిడి జరిగిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పరిస్థితి మారిపోయింది. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు తనదైన శైలిలో పావులు కదిపి బీఆర్ఎస్‌ను నిర్వీర్యం చేయడంతో పాటు ఆ పార్టీని వెన్నంటే ఉన్న వారిని చేరదీసి ఛైర్‌పర్సన్ పదవిని ఇచ్చారు. అచ్చంపేట మునిసిపాలిటీ కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం కానుంది. బీఆర్ఎస్ మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు అభ్యర్థన వెళ్లగా అవిశ్వాసంపై రేపు ఓటింగ్ జరగనుంది. అయితే ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను నిరూపించుకోనుంది.

కందనూలు మునిసిపాలిటీపై మీమాంస

బీఆర్ఎస్ ఆధిపత్యంలో ఉన్న కందనూలు మునిసిపాలిటీపై మీమాంస నెలకొంది. మొత్తం 24మంది కౌన్సిలర్లు ఉన్న మునిసిపాలిటీలో ప్రభుత్వ ఉద్యోగం రావడం కారణంగా ఒక మహిళా కౌన్సిలర్ రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి తొమ్మిదిమంది కౌన్సిలర్లు గెలుపొందగా బీఆర్ఎస్ నుంచి పది మంది గెలుపొందారు. వారిలో ఐదుగురు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా ఒకరు బీజేపీ పంచన ఉన్నారు. ప్రస్తుత ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 12మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు తగిన సంఖ్యాబలం కాంగ్రెస్ పార్టీకి ఉంది. వీరికి తోడు మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారు. అయితే మునిసిపల్ ఛైర్మన్ల పదవీకాలం మరో ఆరునెలల్లోపు ముగియనున్న నేపథ్యంలో అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సిన అవశ్యకత ఉందా, లేదా అనే అంశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్నందున ఆయన వచ్చాకే నాగర్‌కర్నూల్ మునిసిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలా, లేదా అనే అంశం తేలనుంది.

సల్కెలాపూర్‌లో పశుగ్రాసం దగ్ధం

ఖిల్లాఘణపురం, జూన్ 11: మండలంలోని సల్కెలాపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని సయ్యదా నసీంఅక్తర్ పంట పొలంలో నిల్వ చేసిన గడ్డివాము (పశుగ్రాసం) మంగళవారం తెల్లవారు జామున దగ్ధమైంది. సల్కెలాపురం గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ అజీజ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తమ పంట పొలంలో నిల్వ చేసిన నాలుగు ట్రాక్టర్ల పశుగ్రాసానికి గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పు పెట్టినట్లు తెలిపారు. గతంలోను రెండు సంవత్సరాల క్రితం అదే పంట పొలంలో కట్టెలకు సైతం నిప్పు పెట్టారని గుర్తు చేశారు. ఉద్దేశపూర్వకంగానే పశుగ్రాసాన్ని దగ్ధం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీహరిని వివరణ కోరగా సల్కెలాపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసాన్ని దగ్ధం చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు.

కొత్తకోటలో జోరు వాన


జోరుగా కురిసిన వర్షానికి కొత్తకోట పట్టణంలో నిలిచిన నీరు

కొత్తకోట, జూన్ 11 : మండలంలో జోరుగా వర్షం కురిసింది. భూములన్నీ నీటితో తడిసి వ్యవసాయ పనులకు సిద్ధమయ్యాయి. వారం రోజులు ఏదో ఒక సమయంలో కొద్ది సేపు మాత్రమే వర్షం పడేది. మంగళవారం మధ్యాహ్నం తుంపర వర్షం చాలాసేపు కురిసింది. దీంతో పట్టణంలోని డ్రైనేజీలు నిండి పొర్లడంతో అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. చౌరస్తాలో నీరు నిలవడంతో కొంత సేపు నీటికుంటను తలపించింది.

జూరాల ఎడమ కాలువలో పూడికతీత


జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ జీరో పాయింట్ వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడిక తీస్తున్న దృశ్యం

అమరచింత, జూన్ 11: జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ జీరో పాయింట్ వద్ద ముమ్మరంగా పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ అడుగు భాగంలో సిల్ట్ పెరిగిపోయింది. ఇందులో రాళ్లు, చెత్తా చెదారంతో కాల్వ సగభాగం కూరుకుపోవడంతో దిగువకు నీరు పోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారులు జూరాల ప్రధాన ఎడమ కాలువ జీరో పాయింట్ నుంచి 100 ఫీట్ల మేరకు సిల్ట్ తొలగించేందుకు రూ.7 లక్షల నిధులతో పనులు చేపట్టారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో గుత్తేదారు ఎడమ కాలువలో ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడికతీత పనులను వేగవంతం చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఇటిక్యాల, జూన్ 11 : జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల ఇటిక్యాల స్టేజీ సమీపంలోని చరిత కిరాణా దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం దుకాణానికి వెళ్లిన యజమాని సుధాకర్ తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. లోనికి వెళ్లి చూడగా, సరుకులు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వాటి విలువ దాదాపు రూ. 40 వేలు ఉంటుందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దొంగతనం

గద్వాల క్రైం, జూన్ 11 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం దొంగతనం జరిగింది. పట్టణ రెండవ ఎస్ఐ రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజకు చెందిన జగన్నాథం అనే వ్యక్తి తన ప్లాట్‌ను విక్రయించాడు. దానిని కొనుగోలుదారు పేరున రిజిస్ట్రేషన్ చేయించేందుకు మంగళవారం గద్వాలలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చాడు. ఈ సందర్భంగా కొనుగోలుదారుడు ఇచ్చిన రూ. 67,500ను తన దగ్గర ఉంచుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి ఆ డబ్బును చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మందిపల్లిలో మృతి చెందిన ఎద్దు

ధన్వాడ, జూన్ 11 : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లిఓ మంగళ వారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మందిపల్లికి చెందిన శ్రీనివాస్ రైతు ఎద్దు మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. దీని విలువ రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, జూన్ 11 : ముందుగా వెళ్తున్న బైకును కంటైనర్ ఢీ కొన్నడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం జడ్చర్ల సమీపంలో జాతీయరహదారిపై చోటుచేసుకుంది. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కందూరి చెన్నయ్య(50), బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని పోలేపల్లికి బైకుపై వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. చెన్నయ్య భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ షురూ

- జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితా విడుదల


సీనియార్టీ జాబితాను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 11: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే భాషాపండితుల, పీఈటీల అప్‌గ్రేడేషన్ సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన పూర్తైంది. గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు సంబంధించి అర్హత, స్కూల్ అసిస్టెంట్లుకు జోన్-2 కు సంబంధించి సీనియార్టీ జాబితా విడుదల చేశారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే బుధవారం మధ్యాహ్నంలోపు తెలిపేందుకు అవకాశం ఇచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వందల మందికిపైగా స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎం పదోన్నతి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీనియార్టీ, కేటగిరి, రోస్టర్ ఆధారంగా పదోన్నతులు ఇవ్వనున్నారు. జీహెచ్‌ఎం పదోన్నతికి సంబంధించి స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్ ఇచ్చేందుకు అవకాశం ఇచ్చారు. మంగళవారం వివిధ కేటగిరిలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి, సిబ్బంది కసరత్తు చేశారు. భాషా పండితుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో పండిట్, పీఈటీల సీనియర్టీ జాబితా తయారు చేయడంపై అధికారుల నిమగ్నమయ్యారు. ఒకే చోట పని చేస్తూ జూన్ 1, 2024 నాటికి ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన టీచర్లు తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు బదిలీలకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో రవీందర్ తెలిపారు. బుధవారం స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడ్ కలిగిన వారు, సెంకడరి గ్రేడ్ టీచర్లు డైట్ కళాశాలలో నిర్వహించనున్న ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డీఈవో సూచించారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు


నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఏడీ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 11: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు సంబంధించి కొత్తగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ప్రాంతీయ అధికారి దినేష్‌కుమార్ నాగర్‌కర్నూల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా విశ్వంత్‌రెడ్డి, నారాయణపేట జిల్లా ఇన్‌స్పెక్టర్‌గా వినయ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. వారు బాధ్యతలు తీసుకున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 17 మంది కొత్తగా నియమితులవ్వగా, అందులో మహబూబ్‌నగర్ జోన్‌కు ఇద్దరిని ఇచ్చారు. వీరు హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. అనంతరం ప్రాంతీయ అధికారి దినేష్ మాట్లాడుతూ బాధ్యతగా పనిచేయాలని, ప్రజలకు నాణ్యమైన మందులు అదేవిధంగా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని సూచించారు.

విద్యుదాఘాతానికి గురైన గొర్రెలకాపరి

- తప్పిన ప్రాణాపాయం


విద్యుదాఘాతానికి గురైన గొర్రెలకాపరి బాలరాజు

మహమ్మదాబాద్ జూన్ 11: మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని దేశాయపల్లి గ్రామంలో గొర్రెల కాపరి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అప్పుడే కరెంట్ పోవడంతో బతికి బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపల్లి గ్రామానికి చెందిన దొంగల బాలరాజ్ మంళవారం గ్రామాని చెందిన చెన్నమ్మ పొలంలో గొర్రెలను మేపుతూ వెళ్తున్నాడు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు బాలరాజు మెడకు తగిలాయి. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే కరెంట్ పోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని మహబూబ్ నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దొంగల లక్ష్మి, చెన్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవాబ్‌పేట, జూన్ 11: ఇద్దరు యువకులపై సోమవారం సాయంత్రం దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిషేక్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండలం బండమీదిపల్లికి చెందిన శివకుమార్, నవాబ్‌పేట మండలం కారూర్‌కు చెందిన నరేష్ ఇద్దరు కలిసి సొంత పనుల నిమిత్తం నవాబ్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తమ పనులు ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా యన్మనగండ్ల సమీపంలో కావలి శ్రీనివాస్, నవీన్ అనే వ్యక్తులు శివ కుమార్, నరేష్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో శివకుమార్ తలకు తీవ్రగాయాలు కాగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శివ తండ్రి పక్కిరయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుత్రోత్సాహం

▸▸ ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటిన తండ్రి


ఆసుపత్రి ఆవరణలో మొక్కను నాటుతున్న రాజు

గద్వాల న్యూటౌన్, జూన్ 11 : భార్యకు సాధారణ కాన్పులో మగ పిల్లవాడు పుట్టాడు. పుత్రోత్సాహంతో బాబు తండ్రి ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటాడు. ధరూర్ మండలం అల్ల పాడు గ్రామానికి చెందిన కావేరికి మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు జరిగి, మగ శిశువు జన్మించాడు. దీంతో బాబు తండ్రి రాజు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శిశువు తల్లి దండ్రులతో పాటు ఆసుపత్రి సిబ్బంది బాబు, నాగరాజు, బాషా పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పార్కింగ్



బస్టాండ్ ప్రాంగణంలో అస్తవ్యస్తంగా పార్క్ చేసిన బైక్‌లు

అడ్డాకుల, జూన్ 11: అడ్డాకుల మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బైక్‌లు, ఆటోలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సంతరోజు అయితే వందలాదిగా వచ్చే బైక్‌లు, ఆటోలు ఇతర పెద్ద వాహనాలు కూడా బస్టాండ్ దగ్గరనే పార్కింగ్ చేస్తున్నారని, ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి నుంచి బస్టాండ్‌లోనికి రావడానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా రావడం లేదని అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. అనుకోని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా కనీసం సంతరోజైనా వాహనాల పార్కింగ్‌కు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రాణిపేట గ్రామంలో టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మిడ్జిల్, జూన్ 11: మండలంలోని రాణిపేట గ్రామంలో మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ(క్షయవాధి) నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు 150మంది హాజరుకాగా అందరికీ ఎక్స్‌రేలు తీసినట్లు డాక్టర్ శివకాంత్ తెలిపారు. మరో 29 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. టీబీ వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. టీబీ వ్యాధి లక్షణాలున్న ప్రతీ ఒక్కరు వైద్యులతో పరీక్షలు చేయించుకొని తగిన మందులను వాడాలని డాక్టర్ శివకాంత్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ సిబ్బంది తిమ్ములు, యాసిన్, వైద్య సిబ్బంది సంపత్‌కుమార్, దేవయ్య జంగయ్య, రాజేశ్వరి, పారిజాత, అంజలమ్మ, జ్యోతి, ఆశ కార్యకర్తలు రాధిక, యాదమ్మ, సునీత, పుష్పమ్మ, వరలక్ష్మీ తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోయిలకొండ జూన్ 11 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 20 సంవత్సరాల తరువాత అందరు ఒకచోట కలిసి గత స్మృతులను గుర్తుకు తెచ్చుకొన్నారు. గతంలో పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. తమ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్, బలరాం, సాయికుమార్, కృష్ణయ్య, లలిత, వాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూన్ 11 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని వింజమూరు గ్రామానికి చెందిన ముడావత్ అర్జున్ అనారోగ్యం బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరు అయిన రూ.1.80 లక్షల ఎల్‌వోసీని మంగళవారం క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రజా ఆరోగ్యానికి అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

రాజాపూర్, జూన్ 11: రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏడీఏ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులను, రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయో..లేదో పరిశీలించారు. నిర్ణయించిన ధరలకే అమ్మకాలు చేపట్టాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి నరేందర్, ఆయా ఫర్టిలైజర్ షాపులు యజమానులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ

రాజాపూర్, జూన్ 11: బడిబాటలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. అన్ని ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను తప్పక బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, సుందర్‌పాల్, గ్రామస్థులు యాదయ్య, పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలల్లో మెరుగైన విద్య

దేవరకద్ర: మండలంలోని ఉన్న సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామని దేవరకద్ర జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రచారం చేశారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫామ్‌లు, నోట్‌పుస్తకాలు వచ్చాయన్నారు. అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు.

ఏఈఓలను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి

- ఏడీఏకు వినతి పత్రం ఇచ్చిన దేవరకద్ర నియోజకవర్గ ఏఈఓలు

భూత్పూర్, జూన్ 11: జీనుగ విత్తనాల పంపిణీ విషయంలో ఏఈఓలను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాల ఏఈఓలు కోరారు. మంగళవారం ఏడీఏ య శ్వంత్‌రావును కలిసివినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాద్ జిల్లాలోని తొర్రూ మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఏఈఓలను జీనుగ విత్తనాల పంపిణీ విషయంలో అక్రమాలు జరి గాయని కారణం చూపిస్తూ అధికారులు ముగ్గురు ఏఈఓలను సస్పెండ్ చేయడం బాధాకమన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ అయిన ఏఈఓలను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాల ఏఈఓలు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి జనుంపల్లి దుశ్యంత్ రెడ్డి

నవాబ్‌పేట, జూన్ 11: గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కారుకొండ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ, మురుగు కాలువల నిర్మాణ పనులకు గ్రామ నాయకులు ఆల భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 11 : జిల్లాలో అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాపరిషత్ కార్యాలయంలో స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. తన ఛాంబర్‌లో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఎక్కడ లోపాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. పండ్ల తోటల పెంపకం, గిరి వికాసం పథకం, చేనేత జౌళి దేవాదాయ, యువజన క్రీడాశాలల అభివృద్ధి పనులపై జరిగిన సమీక్ష సందర్భంగా పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అన్నారు. జడ్పీ నిధుల నుంచి మంజూరు అయిన పనులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులను అధికారులు పరిశీలించి నాణ్యత ప్రయాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో క్రమం తప్పకుండా జ్వర పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఉండే పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకులను ప్రతీ నెల రెండుసార్లు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేయాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరాలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జడ్పీ సీఈవో రాఘవేంద్రరావు, జడ్పీటీసీ సభ్యుడు విజయ్ భాస్కర్, పీఆర్‌ఈఈ నరేందర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యాదయ్య

రైతు భరోసా ఇవ్వాలి

వానాకాలంలో రైతులకు రైతు భరోసా ఇవ్వాలని జడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య తెలిపారు. మంగళవారం జడ్పీ సీఈవో చాంబర్‌లో వ్యవసాయ శాఖ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేయాలన్నారు. రైతులకు డ్రమ్ సీడ్ నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పించాలని, ఈ పద్ధతి వల్ల రైతులకు కూలీల కొరత తగ్గుతాయని తెలిపారు. జిల్లాలో పాడి సంపదను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుబంధు అందని రైతులను గుర్తించి రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతు బీమా పెండింగ్ దరకాస్తులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు.

పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలి

- కలెక్టర్ రవినాయక్

- ఎమ్మెల్యేతో కలిసి పథకాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), జూన్ 11 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ జి. రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు, ప్రగతిని సమీక్షించారు. నియోజకవర్గంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక వసతులు, పనులు, ప్రగతి, పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాల పంపిణీ, తాగునీరు సరఫరా, మిషన్ భగీరథ నీటిసరఫరా, మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో శాఖల వారీగా చేపట్టిన పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులు దృష్టి సారించాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల, అధికారులు కలిసి సమన్వయంతో ఒక టీమ్ మాదిరి పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని, ప్రజల ఆకాంక్షల అనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గతంలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ స్థలాలను రికవరీ చేయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా తాగు నీటి సౌకర్యం, విద్యుదీకరణ, టాయిలెట్లు వాడుకలో తీసుకురావడం, మరమ్మతు పనులు విద్యార్థినులకు టాయిలెట్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు 40 ఎంఎల్ డి కి గాను మిషన్ భగీరథ ద్వారా, పవర్ బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పలుశాఖ పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : ఈ నెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. ఒక సంవత్సరం నుంచి 19సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోలు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని పాఠశాలు, కళాశాలల్లో ఉచితంగా మాత్రల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లల్లో ఉన్న నులిపురుగులు చనిపోతాయని అన్నారు. దీంతో పిల్లలు ఆరోగ్యం, చురుకుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఆఫీస్ ద్వారా పెండింగ్ ఫైళ్లను వేగవంతం చేయాలన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలులో భాగంగా ధాన్యం మిగిలి ఉంటే వెంటనే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అలుగు కాలువ పనులు చేపట్టండి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- పెద్దచెరువు అలుగు నుంచి వెళ్లే కాలువ పనుల పరిశీలన




పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 11: వర్షాలు కురుస్తున్నాయని, చెరువు నిండితే అలుగు నుంచి నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. పెద్దచెరువు బీకేరెడ్డికాలనీ అలుగు నుంచి నీరు బయటకు మళ్లించేందుకు నిర్మిస్తున్న కాలువ పనులను మైత్రీనగర్ వద్ద మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచాలని పబ్లిక్‌హెల్త్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వర్షాలు కురుస్తుండటంతో పెద్దచెరువలోకి వరదనీరు చేరుతుంది. పెద్దవర్షాలు పడితే చెరువులోకి భారీగా వరదనీరు చేరి చెరువు నిండి అలుగుల నుంచి దిగువకు నీరు వెళ్లే కాలువలు చిన్నవిగా ఉండటం వల్ల కాలువలు నిండి రోడ్లపైకి వచ్చే నీరు ఇళ్లలోకి చేరు ప్రమాదమున్నదన్నారు. గతంలో ఇలాంటివి చాలా జరిగాయని, అందుకే అలుగునీరు బయటకు పంపించేందుకు నాలా పనులు చేపడుతున్నామని ఈ పనులు పూర్తైతే నీరు ఇళ్లలోని చేరే ప్రమాదం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, పబ్లిక్‌హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి , కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

317 జీవో సమస్యలు పరిష్కరించండి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరకు వినతి పత్రం అందజేత



మంత్రితో మాట్లాడుతున్న హర్షవర్ధన్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 11: 317 జీవో బాధితుల సమస్యలు పరిష్కరించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి జి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్ పోర్టల్‌లో స్థానిక త అంశాన్ని చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నేడు కేబినెట్ సబ్ కమిటీ మీటింగ్ ఉందని, ఈ సమావేశంలో 317 జీవోపై చర్చిస్తామని తెలిపినట్లు హర్షవర్ధన్ వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావును కలిసి పలు సమస్యలు ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పార్వతి సత్యనారాయణ, టీపీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ సభ్యులు శ్రీనివాసరావు, వికారాబాద్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు కాలె శ్రీశైలం, మల్లేశం, ఆర్థిక కార్యదర్శి చక్రపాణి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం సెక్రటరీ శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూన్ 11: జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో త్వరలో రాష్ట్రస్థాయి టో ర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం జనరల్ సెక్రటరీ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం స్టేడియంలో గల ఆ సంఘ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ స్మారక టోర్నీ నిర్వహణ కోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా సంఘ ప్రతినిధులతో చర్చించి టోర్నీ వివరాలు వెల్లడిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు టోనీ మార్టిన్, ఉపాధ్యక్షుడు నర్సింహా, సంయుక్త కార్యదర్శులు సాదిక్‌అలీ, రమేష్‌బాబు, మేరిపుష్ప, కోశాధికారి ఆనంద్, కార్యనిర్వహణ కార్యదర్శులు సీ. శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, నర్సింహులు, సీనియర్ క్రీడాకారులు జావీద్, పీఈటీలు దత్తాత్రేయ, రాజు, శ్రీనివాస్ , కుమార్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

- జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం



బెల్టులు సాధించిన విద్యార్థులతో జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూన్ 11: మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అల్‌నూర్ హై స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేలో కనీసం మూడేళ్లకు పైగా శిక్షణ తీసుకోవాలని, ప్రతిభ ఆధారంగా బెల్టులు అందజేయాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని, బాలికలు తప్పనిసరి నేర్చుకోవాలన్నారు. కరాటేలో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించడం పట్ల మాస్టర్ జహంగీర్ అభినందించారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్నవీరయ్య, చీఫ్ ప్యాట్రన్ లక్ష్మణ్, స్కూల్ ప్రిన్సిపాల్ నజీయాసుల్తాన, డైరెక్టర్ ఖాజా పాషా, కరస్పాండెంట్ అహద్‌సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే, యోగా వేసవి శిబిరం

శ్రీ హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో మాడల్‌బేసిక్ స్కూల్ లో ఏర్పాటు చేసిన వేసవి యోగా, కరాటే శిక్షణ శిబిరం ముగిసింది. మంగళవారం శిబిరానికి ముఖ్య అతిథిగా సీపీఐ టౌన్ సెక్రటరీ కోట కదిరే నర్సింహులు హాజరై విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం, చదువులో చురుకుగా రాణిస్తారని తెలిపారు. మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ నెల రోజులుగా విద్యార్థులక యోగా, కరాటేలో శిక్షణ అందజేశామన్నారు. ప్రతీ ఏడాది వేసవి శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాసిత్, బుచ్చన్న, మహేందర్, హరి, శివశంకర్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు, రేపు నిత్యశుద్ధానందగిరి స్వామి ఆరాధన మహోత్సవం

జడ్చర్ల, జూన్ 11 : జడ్చర్ల మండలం గంగాపురం సమీపంలోని శ్రీమలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో నిత్య శుద్ధానందగిరి స్వామి ఆరాధాన మహోత్స వాలను ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకట్‌చరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గంగాపురం సమీపంలో శ్రీమలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమాన్ని నిర్మించిన నిత్య శుద్ధానందగిరి స్వామి 2021 జూన్ 16న శివైక్యం చెందారని పేర్కొన్నారు. ఆశ్రమ అభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో తృతీయ ఆరాధన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

రేపు గండీడ్ మండల సమావేశం

గండీడ్ , జూన్ 11 : గండీడ్ మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశా నికి ఎంపీపీ మాధవి అధ్యక్షత వహిస్తారన్నారు. ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో నేరుగా అడ్మిషన్లు

జడ్చర్ల, జూన్ 11 : జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలోని గిరిజన బాలుర కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రదించి, అనువైన గ్రూపులో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు.

14న జడ్పీ సర్వసభ సమావేశం

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 11 : జిల్లా పరిషత్ సర్వసభ సమావేశాన్ని ఈనెల 14న ఉదయం 10:30గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో రాఘవేంద్ర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమా వేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

యూనిఫామ్ అందజేత

గండీడ్, జూన్ 11: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కుట్టిన యూనిఫామ్‌లు మంగళవారం మండల కేంద్రంలో ఏపీఎం బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీవో దేవన్న, విద్యాధికారి వెంకటయ్యకు అందించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండల పరిధిలోని 49 పాఠశాలలకు మొదటి విడతగా 3306మంది విద్యార్థులకు యూనిఫామ్ కుట్టి అందించినట్లు తెలిపారు. మిగిలిన దుస్తులను బుధవారం అందిస్తామన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌ను ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు విద్యాధికారి తెలిపారు. పాఠశాలలకు నూతనంగా చేరే విద్యార్థులకు కూడా దుస్తులు ఇస్తామన్నారు.

మొక్కలు నాటడానికి గుంతలు సిద్ధం

గండీడ్, జూన్ 11: మండల పరిధిలోని లింగాయిపల్లి, రంగారెడ్డిపల్లి, జక్లపల్లి, పెద్దవార్వల్, చిన్నవార్వల్ తదితర గ్రామాల్లో వర్షాలు కురవడంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేసినట్లు ఏపీవో హరిచంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన కూలీలు తీసిన గుంతలను పరిశీలించారు. రోడ్డు ప్రక్కల మొక్కలను నాటేందుకు సరైన లోతులో గుంతలు తీయాలని సూచించారు. గతేడాది నాటిన మొక్కలు కనిపించడం లేదని, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు.

కుక్కల బారి నుంచి కాపాడాలి

జడ్చర్ల, జూన్ 11 : జడ్చర్ల మునిసిపాలిటీలో పందులు, కుక్కల బెడత అధికమయ్యిందని, వాటి బారి నుంచి కాపాడాలని పట్టణవాసులు ఎంబీ బాలకృష్ణ, అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం జడ్చర్ల మునిసిపల్ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పందులు, కుక్కల బెడద అధికంగా ఉందని ఇప్పటికే పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకవచ్చినా ఫలితం లేదని వారు వాపోయారు. అలాగే బాదేపల్లి పాతబజారులోని పోచమ్మ దేవాలయం సమీపంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే

దేవరకద్ర, జూన్ 11: మండలంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ ద్వారా నీరు వస్తుందా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ యాప్‌లో లబ్ధిదారుడి వివరాలు నమోదు చేశారు. అలాగే గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయో వివరాలను సేకరించారు.

రాజీ పడని నిత్య శ్రామికుడు రామోజీరావు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 11 : తాను తలపెట్టిన పనిని ఎంత కష్టమైన భరించి సాధించే వరకు రాజీపడని నిత్య శ్రామికుడు రామోజీరావు అని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పారిశ్రామికవాడ సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అక్కినేని నారాయణరావు, నస్కంటి నాగభూషణం, రాజసింహుడు, పోకల శివుడు, జీబీ పాల్ పాల్గొన్నారు.